నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, సోమవారం 17 మార్చి 2025 | MAHABUBNAGAR NARAYANPET

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నుంచి జన్మదిన శుభాకాంక్షలు అందుకుంటున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

వెల్లువెత్తిన అభిమానం

- ఘనంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 16 : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి బైక్ ర్యాలీ, కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పిస్తాహౌస్ నుంచి పార్టీ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీతో మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శ్రీనివాస్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు,అభిమానులు ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్ స్టేటస్‌లలో శుభాకాంక్షలు తెలిపారు. మయూరి ఎకో పార్క్, గౌడ సంఘం, పిస్తాహౌస్, ఎదిరలో బీఆర్ఎస్ నాయకులు కేక్‌కట్ చేశారు. ఆదివారం ఉదయం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీసీటీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని భుజాలపై ఎత్తుకొని ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలు

అక్రమ విరాసత్‌కు పన్నాగం

- వారసులకు బదులు ఇతరుల పేరిట ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ
- గట్టు రెవెన్యూ అధికారుల తప్పిదం

గట్టు, మార్చి 16 : మండలంలోని ఇందువాసికి చెందిన ముత్తయ్య పట్టాదారు. ఇతడికి ఇందువాసి శివారులో 385/బీ/1 సర్వేనెంబర్‌లో ఎ.5.18గుంటల భూమి ఉన్నది. ముత్తయ్య చాలాకాలం కిందట మృతిచెందినా కూడా 09-03-2019న మృతిచెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం పొందారు. ఇతడి భార్య లూసమ్మ, పెద్ద కుమారుడు, పెద్ద కుమార్తెలు ఇంజన్న, పెద్ద ఇంజమ్మ మృతిచెందగా, ప్రకాశ్, నడిపి ఇంజమ్మ, చిన్న ఇంజమ్మ ఉన్నారు. పొలాన్ని ఇతరులకు కౌలుకు ఇచ్చిన ముత్తయ్య సంతానం చెట్టు కొకరు, గుట్ట కొకరన్నట్లుగా వేర్వేరు ప్రాంతాల్లో ఉపాధి పొందుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దాయాదుల సంతానంలో ఒకరైన ఇందువాసికే చెందిన హెచ్.విజయ్ కొందరి సహకారంతో ముత్తయ్య పొలం కైంకర్యానికి పన్నాగం పన్నాడు. తన తండ్రి ఆధార్‌ను ఇంజన్న అలియాస్ ముత్తయ్యగా మార్చిడి చేయించుకొని అసలైన పట్టాదారు ముత్తయ్య ఆధార్‌నెం బర్‌ను లింక్ చేయించాడు. అధికారులతో ముత్తయ్యకు తామే వారసులమంటూ హెచ్.విజయ్ తన పేరు తోపాటు తన తల్లి సుశీలమ్మ బతికున్నా కూడా మరణించినట్లు కుటుంబ ధ్రువీకరణ పత్రం(ఎఫ్‌ఎంసీ) పొందాడు. అయితే తాసీల్దార్‌గా సరి తాణి పనిచేస్తున్న సమయంలోనే 16-11-2024న ఈ ధ్రువీకరణ పత్రం జారీకావడం ఇక్కడ కొసమెరుపు. అయితే ఈ ధ్రువీకరణ పత్రం జారీపై అనేక రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జారీ చేసిన తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్

విరాసత్‌కు ప్రయత్నం..

స్లాట్ బుక్ చేసుకున్న సదరు వ్యక్తులు విరాసత్‌కు వెళ్లారు. అయితే ఈ సమయంలో పట్టాదారు కుటుంబ సభ్యుల తోపాటు, స్థానికులు కొందరు ఇది అక్రమ విరాసత్ అని, తప్పుడు ఫ్యామిలీ మెంటర్ సర్టిఫికెట్ పొంది పట్టా మార్చిడి చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, గట్టిగా తేల్చిచెప్పడంతో విరాసత్ ఆగింది. అయితే ఈ విరాసత్‌కు ఇంకా పావులు కదువుతున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, తమ పన్నాగం బెడిసికొట్టడంతో అక్రమ విరాసత్‌కు పూనుకున్న సదరు వ్యక్తి తన తండ్రి ఇంజన్న అలియాస్ ముత్తయ్య, నిజమైన పట్టాదారు ముత్తయ్య ఆధార్‌తో నెలకొన్న లింక్‌ను తొలగించాలని తాసీల్దార్‌కు ఈనెల 7వ తేదీన వినతిపత్రం అందించాడు. లింక్ కారణంగానే తప్పిదం జరిగినట్లుగాఇందులో తన ప్రమేయం ఏమీలేదన్నట్లుగా నిరూపించుకోవడానికి సదరు వ్యక్తి ప్రయత్నం చేస్తున్నాడు. ఈ అక్రమ విరాసత్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అసలు పట్టాదారు ముత్తయ్య కుమారుడు ప్రకాశ్ తెలిపారు. ఈ వ్యవహారాన్ని సోమవారం తేల్చనున్నట్లు ఎస్సై హామీ ఇచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

సంబంధం లేని వ్యక్తుల పేరిట ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ అయిన విషయాన్ని గుర్తించాం. ఇది గత తాసీల్దార్ కాలంలో జరిగింది. దీన్ని రద్దు చేయించడానికి ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు లేఖలు పంపించాం. త్వరలోనే ఇది రద్దవుతుంది. ఈ విరాసత్ ఎట్టి పరిస్థితుల్లో జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

– సలీముద్దీన్, తాసీల్దార్, గట్టు

గట్టు తాసీల్దార్ కార్యాలయం

- జూరాల ప్రాజెక్టులో రోజురోజుకు ఇంకిపోతున్న నీరు
- ర్యాలంపాడు రిజర్వాయర్‌లో పడిపోయిన నీటి నిల్వలు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు
- నీళ్లిచ్చి ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు
- కర్ణాటక ఇచ్చే నీటి కోసం ఎదురుచూపులు

జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

జలాశయాల్లో.. అడుగంటుతున్న జలం

గద్వాల, మార్చి 16 : ఉమ్మడి జిల్లాకు వర ప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టులో రోజురోజుకు నీరు ఇంకిపోతున్నది. దీంతో జూరాల ప్రాజెక్టు పరిధిలో పంటలు సాగు చేసిన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు వారబంధి ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడతామని అధికారులు చెబుతున్నా ప్రస్తుతం జలాశయాల్లో నీరింకి పోతుండడంతో అధికారుల మాటలు రైతులు నమ్మే పరిస్థితిలో లేరు. యాసంగిలో 5 టీఎంసీల నీటిని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరగా, 4టీఎంసీలు విడుదల చేయడానికి అంగీకరించినట్లు ఇక్కడి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు చెప్పారు. అయితే ఇప్పటి వరకు కర్ణాటక ప్రభుత్వం కేవలం 0.45 టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేసింది. మిగతా నీటిని విడుదల చేస్తే తప్ప ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదు. ప్రాజెక్టుల్లో నీళ్లు లేక జూరాల ప్రాజెక్టు పరిధిలో రైతులు క్రాఫ్‌హాలిడే ప్రకటించారు. చేతికొచ్చిన పంటలు ఎండుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మోటర్లను బంద్ చేయిస్తే దిగువకు నీరు వచ్చి మా పంటలు పండుతాయని రైతులు వేడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రతిపాదిత ఆయకట్టు..

జూరాల ప్రాజెక్టు పరిధిలో యాసంగిలో వివిధ లిఫ్టుల కింద ఆరుతడి పంటలకు నీటిని విడుదల చేస్తామని ఎత్తిపోతల వారీగా ఆయకట్టు వివరాలు ప్రకటించారు. జూరాల ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ కాల్వల కింద 34,346 ఎకరాలు, నెట్టెంపాడ్ కింద 24,800, బీమా కింద 29,000, కోయిల్‌సాగర్ కింద 8వేల ఎకరాలకు వారబంధి పద్ధతిలో నీటిని ఏప్రిల్ 15వ తేదీ వరకు విడుదల చేస్తామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 0.911(లైవ్)టీఎంసీల నీరు ఉన్నది. ర్యాలంపాడ్ 4టీఎంసీల నీరు ఉండాల్సి ఉండగా, లీకేజీల కారణంగా ప్రస్తుతం 1టీఎంసీ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితిలో ఉండడంతో ఈ ప్రభావం పంటలపై పడుతున్నది. పంటలు చేతికి రావాలంటే కర్ణాటక నుంచి కనీసం 1.2టీఎంసీల నుంచి 2టీఎంసీల నీటిని విడుదల చేస్తే తప్ప కాపాడలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా మంత్రితో పాటు ఎమ్మెల్యేలు మరోసారి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నీటిని విడుదల చేస్తే పంటలు చేతికొచ్చే పరిస్థితి ఉన్నది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నాలు చేయాలని రైతులు వేడుకొంటున్నారు.



ర్యాలంపాడులో పడిపోయిన నీటినిల్వ



జూరాల ఆయకట్టు కింద ఎండిన వరిపంట

జూరాల కాల్వకు వేసిన మోటర్లు పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

చేతికొచ్చిన పంట ఎండుతుంది..

ర్యాలంపాడ్ రిజర్వాయర్ నుంచి నీళ్లు వస్తాయని ఆశించి రెండు ఎకరాల్లో వరి, ఎకరంలో పొగాకు, మిగతా పొలంలో అలసందలు సాగు చేశాం. ఎకరాపై ఇప్పటికే రూ.20వేలకుపైనే పెట్టుబడి పెట్టాం. ప్రస్తుతం పొగాకు ఎండిపోయింది. వరి నీళ్లు లేక భూమి నెర్రలుబారింది.అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని పంటలకు నీళ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– కావలి సరోజమ్మ, గట్టు

కొనసాగుతున్న సహాయక చర్యలు

- ఎస్ఎల్‌బీసీలో మృతదేహాల ఆచూకీ కోసం శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు
- ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేట, మార్చి 16 : దోమల పెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న మిగిలిన ఏడుగురి జాడ కోసం అన్వేషణ కొనసాగుతున్నది. గత 23 రోజులుగా రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నారు. డీ1, డీ 2 ప్రదేశాలలో తవ్వకాలు చేపడుతున్నారు. డీ వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. డేంజర్ ప్రవేశంగా గుర్తించిన ప్రవేశంలో రోబో ద్వారా సహాయక చర్యలు వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం దోమల పెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్న తాధికారులతో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే బృందం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్, హైడ్రా, ర్యాట్ మైనర్స్ బృంద సభ్యులతో భారీ స్థాయిలో సహాయక చర్యలు కొనసాగిస్తూ, సహాయక బృందాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను, పనికి కావలసిన సామగ్రిని, నిరంతరం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగేవిధంగా సహాయక బృందాలకు పౌష్టికాహారం, తాగునీరు, మరియు మెడికల్ సపోర్ట్, సమయానికి అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమీక్ష సమావేశంలో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ర్యాట్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, దక్షిణ మధ్య రైల్వే బృందాలు పాల్గొన్నారు.

సహాయక బృందాలకు సదుపాయాలు కల్పించాలి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక బృందాలకు అందిస్తున్న వసతి సదుపాయాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. దోమలపెంటలోని జెడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, స్పోర్ట్స్ క్లబ్, ఈగలపెంటలోని జిమ్ సెంటర్, కళాభారతి, పటేల్ హాల్, ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వసతి సదుపాయాలను పరిశీలించి, అవసరమైన మార్పులను కలెక్టర్ అధికారులకు సూచించారు. సహాయక బృందాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యలు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

హత్యకు దారితీసిన అక్రమ సంబంధం

- పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హంతకుల గుర్తింపు
- వ్యక్తి హత్య కేసులో నింధితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన జడ్చర్ల సీఐ కమలాకర్

జడ్చర్ల టౌన్, మార్చి 16 : పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో అనుమానాస్పదంగా మృతిచెందిన ఓ వ్యక్తి కేసుకు సంబంధించి వచ్చిన పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగానే హత్యకేసులో నింధితులు పట్టుబడ్డారు. ఆదివారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్చర్ల సీఐ కమలాకర్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న కోటయ్య (50) హమాలీ పనిచేసేవాడు. అదే కాలనీలో నివాసముంటున్న రాజ్‌కుమార్‌తో తన భార్య అలివేలుకు వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు కోటయ్య గుర్తించి వారిద్దరినీ మందలించాడు. దీంతో తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న కోటయ్యను ఎలాగైనా తొలగించాలని నిర్ణయించుకున్నారు. జనవరి 23వ తేదీన కోటయ్య షాద్‌నగర్‌లో ఫంక్షన్‌కు వెళ్లాడు. రాత్రి 11:30 గంటల వరకు కోటయ్య ఇంటికి రాకపోవటంతో అతడు తిరిగి రాడని భావించి అలివేలు, రాజ్‌కుమార్ ఇంట్లో కలిసి ఉన్నారు. ఈ తరుణంలో ఆకస్మాత్తుగా కోటయ్య ఇంటికొచ్చి ఇంట్లో ఉన్న ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. దీంతో ఈ విషయం ఇతరులకు తెలుస్తోందన్న భయంతో నింది తుల్లిరూ కలిసి కోటయ్య మెడకు చున్నీతో చుట్టి చంపి, ఎవరికీ అనుమానం రాకుండా పక్కనే ఉన్న పాత ఇంటికి తీసుకెళ్లి సహజంగా చనిపోయినట్లు అతడిని పడుకోబెట్టి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత నింది తురాలు అలివేలు తన పిల్లలు, బంధువుల వద్దకెళ్లి తన భర్త ఇంటికి రాలేదని గాలిస్తూ పాత ఇంట్లో పడి ఉన్న కోటయ్యను చూసి దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కోటయ్య మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి బంధువు నాగయ్య జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. ఓ వైపు పోలీసులు విచారణ చేపడుతున్న క్రమంలో మృతుడు కోటయ్యది సహజమరణం కాదని, గొంతు నులిమటంతో చనిపోయినట్లుగా పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. దీంతో పోలీసులు ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి మృతుడి భార్య అలివేలను అదుపులోకి తీసుకొని విచారించారు. హత్య చేసినట్లు నిందితులిద్దరూ అంగీకరించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నింది తులిద్దరినీ జడ్చర్ల కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కమలాకర్



అయిజ : ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

ఆర్డీఎస్‌లో తగ్గుతున్న నీటి నిల్వ

- ఎగువ నుంచి నిలిచిన ఇన్‌ఫ్లో

అయిజ, మార్చి 16 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో నీటి నిల్వ క్రమేపీ తగ్గుతోంది. టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్, కేసీ కెనాల్ జాయింట్ ఇండెంట్ నీటిని ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు విడుదల చేశారు. మూడు రోజుల పాటు ఆనకట్టకు ఇన్‌ఫ్లో ఉండేది. ఆదివారం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోవడంతో ఆనకట్టలో నీటిమట్టం 8అడుగులకు చేరుకున్నది. ప్రస్తుతం ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 596 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తెలంగాణ పరిధిలోని ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు చేరుతున్నదని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక, ఏపీ రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలకు 6,925 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 20.876 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1599.49 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

పునరావాసం కల్పించే వరకు దీక్షలు

ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద దీక్ష చేస్తున్న నిర్వాసితులు

జడ్చర్ల, మార్చి 16 : ఉదండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు పునరావాసం కల్పించి ప్యాకేజీని ఇచ్చే వరకు నిరసన దీక్షలు కొనసాగుతూనే ఉంటాయని ఉదండాపూర్ భూ నిర్వాసితులు హెచ్చరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలంటూ రిజర్వాయర్ నిర్వాసితులు 37రోజులుగా నిరసన దీక్షలు చేస్తూనే ఉన్నారు. ఆదివారం కూడా దీక్షలు కొనసాగాయి. ప్రభుత్వం తమ భూములను తీసుకొని ప్యాకేజీని ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వ్యవసాయాన్నే నమ్ముకొని జీవించే తాము ఇతర పనులకు వెళ్లలేక పూట గడవటం కష్టంగా మారిందన్నారు. పునరావాస ప్యాకేజీ ఇచ్చే వరకు పనులను చేపట్టనీయమని, నిరసదీక్షలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శంకరయ్యగౌడ్, వెంకటయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

నమస్తే ఎఫెక్ట్

మూసాపేట(అడ్డాకుల), మార్చి 16 : అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో పంటలు ఎండుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆదివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'జలం ఇంకి.. పంట ఎండి' శీర్షికతో వెలుగులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఇందుకు ఆదివారం విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. డీఈ చంద్రమౌళి స్పందించారు. ఆయన ఆదేశాలతో అడ్డాకుల ఏఈ రాములు తిమ్మాయిపల్లి రైతులతో మాట్లాడినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే తనకు సమాచారమిస్తే వెంటనే సరిచేస్తానని చెప్పారు. అదేవిధంగా ప్రతి రోజూ సాయంత్రం 5:30గంటల నుంచి రాత్రి 11:30వరకు గతంలో విద్యుత్ కోత ఉండేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం రాత్రి 11:30గంటల వరకు కాకుండా 1:30గంటల వరకు కోతను విధిస్తున్న మాట వాస్తవమేనని చెప్పారు. ఆ విషయంపై తమ పరిధిలో ఏం చేయగలుగుతుని, లోఓల్టేజీ, విద్యుత్ నియంత్రికల సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కరిస్తాయని చెప్పారు.